విద్యార్థులకు చట్టాల పట్ల అవగాహన ఉండాలి



అసెంబ్లీకి బస్సుల్లో వెళ్తున్న విద్యార్థులు

మల్కాజిగిరి, మార్చి 25: చట్టాల పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరిలోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు శాసనసభ వ్యవహారాల గురించి తెలుసుకోవడానికి విద్యార్థులు అసెంబ్లీకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, జేఏసీ అధ్యక్షుడు వెంకన్న, రాముయాదవ్, శ్రీనివాస్ గౌడ్, చిన్న యాదవ్, ఉపేందర్, అనిల్, సతీష్, సంతోష్ గుప్త, నర్సింగ్, వాసు, శ్రీధర్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్

మల్లాపూర్, మార్చి 25 : నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్పొరేటర్ జె. ప్రభుదాస్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మీర్‌పేట్ హెబ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని సెయింట్ పాల్స్ పాఠశాలలో జలమండలి వారి సహకారంతో నిర్వహించిన ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ ఇండ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వర్షపు నీటిని వృథా చేయకుండా నిల్వ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీశ్, ఏజీఎం వేణుగోపాల్, స్థానిక నాయకులు వెంకటచారి, చంద్రశేఖర్, మురళీకృష్ణ పాఠశాల ప్రిన్సిపాల్ సత్తి రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల బాలికలకు వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 25: రాష్ట్ర క్రీడా పాధికార సంస్థ క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు జిల్లాలో 14 సంవత్సరాల్లోపు వయసు కలిగిన బాల బాలికలకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు (క్రీడలు) నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి కలిగిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నేషనల్ క్రీడాకారులు, సీనియర్ క్రీడాకారులు వారు నిర్వహించదలచిన క్రీడలు, ప్రదేశం,గ్రామం, మొబైల్ నెంబర్ సహా వివరాలతో కూడిన దరఖాస్తులను ఈనెల 28లోపు జిల్లా యువజన,క్రీడల శాఖ కార్యాలయంలో అంజేయాలని సూచించారు.క్రీడలు నిర్వహించే వారికి గౌరవ వేతనం, క్రీడాసామగ్రి అందజేస్తామని అన్నారు.

మల్కాజిగిరి చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

మేడ్చల్‌లో ఆందోళన నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

'ఆశ'ల అక్రమ అరెస్టులపై ఆందోళన

మేడ్చల్, మార్చి 25: పోలీసుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో మంగళవారం ఆందోళన నిర్వహించారు. బస్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన జరిపి, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు నరేశ్ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని, మహిళలని చూడకుండా పిడుగులు గుద్దులు కురిపించారని, ఇండ్లల్లోకి వెళ్లి ముందస్తు అరెస్టు చేశారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇస్తామని, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం లేదని శాంతియుతంగా నిరసన తెలిపితే అప్రజాస్వామికంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఆశకార్యకర్తలు ఎంతో ఉన్నతంగా సేవలందిస్తున్నారని, కరోనా సమయంలో ప్రజలకు నిత్యం అందుబాటులో అందించిన సేవలు వెలకట్టలేని వన్నారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశకార్యకర్తల సంఘం నాయకురాళ్లు రాజకుమారి, రాజమణి, యాదమ్మ, సునంద, మమత, పద్మ, రజిత, లావణ్య, రాణి, అరుణ, ఫయూమ్, అనిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలి

మల్కాజిగిరి: ఆశవర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని యూనియన్ నాయకుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మల్కాజిగిరి చౌరస్తా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోఠిలోని వైద్య శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడానికి వెళ్తున్న ఆశవర్కర్లపై పోలీసులు నిర్బంధం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలకు రూ.18వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఏ హేమలత, సీఐటీయూ మండల కార్యదర్శి నర్సింగరావు, టీ హేమలత, సంతోష, వసంత, సుమలత, రాజ్యలక్ష్మి, స్వప్న, చంద్రకాంత, పావని పాల్గొన్నారు.

ముత్తేశ్‌కు ఎమ్మెల్యే సన్మానం

చర్లపల్లి: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఎఫ్‌సీ ఉద్యోగి గడ్డం ముత్తేశ్ పదవీవిరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం హాజరై ముత్తేశ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేమూరి మహేశ్‌గౌడ్, రమేశ్, రహీం, కొమ్ము రమేశ్, రాజిరెడ్డి, జైప్రసాద్, శ్రీశైలం, అనిల్, సంపత్, చిన్నా, బాలాజీ, రఘు పాల్గొన్నారు.

అన్ని రూట్లలో బస్సులు నడిపేందుకు చర్యలు

క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి,మార్చి25: మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని రూట్లలో ఆర్టీస్‌బస్సులను నడపడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు అన్ని రూట్లలో నడవకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇదే విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బస్ సౌకర్యంతో పాటు బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశానని తెలిపారు. మంత్రి ఆదేశాలతో ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించి అన్ని రూట్లలో బస్సులను నడపడంతో పాటు బస్‌షెల్టర్లను నిర్మించాలని ఆదేశించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ పవిత్ర, కుషాయిగూడ డిపో మేనేజర్ మహేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు మెరుగైన

ఆర్థిక నైపుణ్యాన్ని సాధించాలి

కీసర, మార్చి 25: మెరుగైన ఆర్థిక నైపుణ్యతను సాధించి నేటి సమాజానికి దిక్సూచిగా విద్యార్థినులు రాణించాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సీహెచ్ లక్ష్మీశావ్య అన్నారు. మంగళవారం ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కీసర ఆధ్వర్యంలో మండలంలోని మహాత్మాజ్యోతిబాపూలే మహిళా గురుకుల డిగ్రీ కళాశాలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతతో పాటు విద్య, ఉద్యోగ నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్థిక విద్యారంగంలో విద్యార్థులు రాణించి సైబర్ నేరాలకు గురికాకుండా ప్రతి ఒక్కరిని చైతన్యం చేసే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ శివప్రసాద్, ప్రిన్సిపాల్ వనజాత, వైస్ ప్రిన్సిపాల్ గంగావతి, ఎస్ఎస్‌టీఎఫ్ఎల్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కో ఆర్డినేటర్ ఎల్లబోయిన విశ్వనాథ్, కౌన్సిలర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సీహెచ్ లక్ష్మీశావ్య

ఫుడ్ సైన్స్‌తో ఉజ్వల భవిష్యత్

సదస్సును ప్రారంభిస్తున్న మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ విజయేందర్ రావు

మేడ్చల్, మార్చి 25: ఫుడ్‌సైన్స్‌తో ఉజ్వల భవిష్యత్ సాధ్యమని వక్తలు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో న్యూ హారిజన్స్ ఇన్‌ఫుడ్ సైన్స్ అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ వీఎస్‌కే రెడ్డి, హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ విజయేంద్రరావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్ కుమార్, అగ్రికల్చర్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి, పరిశ్రమ నిపుణులు నాబార్డుకు చెందిన పాండురంగ్, సీఎస్ఐఆర్ సీఎఫ్‌టీఆర్ఐ డాక్టర్ జ్యోతిర్మయి, ఎఫ్ఎస్ఎస్ఏఐ చందన, న్యూట్రీటెక్ సీఈఓ డాక్టర్ సురేశ్, వీర్ శెట్టి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫుడ్ పరిశ్రమ విస్తృతంగా విస్తరిస్తుందన్నారు. ఈ రంగంలో ప్రవేశించిన నూతన విధానాలు, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధిస్తే ఉపాధి అవకాశాలకు కొదువ ఉండదన్నారు. ఈ సదస్సు ఫుడ్‌సైన్స్ రంగంలో ఒక మైలురాయి వంటిందని కొనియాడారు. స్కూల్ ఆఫ్‌అగ్రికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో 320 మంది ప్రముఖులు, వక్తలు పాల్గొన్నారు. ఆహార శాస్త్రంలో విద్యా-పరిశ్రమ సహకారం యొక్క ఆవశ్యకతపై నిపుణులు చర్చించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

మహ్మద్ అసీఫ్ (ఫైల్)

మల్కాజిగిరి, మార్చి 25: అదృశ్యమైన వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీకి చెందిన మహ్మద్ అసీఫ్ (40) వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి మద్యం తాగడానికి బయటకు వెళ్లాడు.రాత్రికి ఇంటికి తిరిగి రాలేదు. ఆయన కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి ఆర్‌కే నగర్ వద్ద పడి ఉన్నట్లు పోలీసులకు సమచారం వచ్చింది. వెంటనే పోలీసులు వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించారు. మంగళవారం ఉదయం గాంధీ దవాఖాన నుంచి పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం ఇచ్చారు. అదృశ్యమైన అసీఫ్ భార్య సయ్యద్ రూఫా గాంధీ మార్చురిలో ఉన్న వ్యక్తి తన భర్తఅని గుర్తించింది. భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జామ మసీద్‌లో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జంగయ్యయాదవ్, ముస్లిం మైనార్టీ నాయకులు

శామీర్‌పేట,మార్చి25 : రంజాన్ మాసం సందర్భంగా మండలకేంద్రంలోని జామ మసీద్‌లో ముస్లింలు మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందులో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ వజ్రేశ్ యాదవ్‌లు పాల్గొని ఒకరినొకరు పండ్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ కాంతమ్మ, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి,ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్, తహసీల్దార్ యాదగిరి రెడ్డి, ఆర్ఐరాఘవ, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ గౌడ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కట్టమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ యాదవ్, మజీద్ సదర్ మహ్మద్ యూసుఫ్, మాజీ సర్పంచ్ కిశోర్ యాదవ్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ముజిబుద్దిన్, మాజీ ఎంపీటీసీ డప్పు సాయిబాబా, నాయకులు చాంద్ పాషా, మహ్మద్ యూసఫ్, ఇర్ఫాన్, అజ్మద్, నజం యూసుఫ్, ప్రభాకర్ రెడ్డి అశోక్, ఆనంద్, శ్రీకర్‌రెడ్డి, యాదగిరి, రవి, హనుమాన్ దాస్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



మండల అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రావణ్ గుప్తాను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

మేడ్చల్, మార్చి 25: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. మేడ్చల్ పట్టణంలోని జేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఆర్య వైశ్య సంఘం నూతన మేడ్చల్ మండల, పట్టణ, యువజన, మహిళ విభాగం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితం కాకుండా సామాజిక ,రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. నిరుపేద వైశ్య కుటుంబాలకు చేయూత అందిస్తామని ఆమె తెలిపారు. మేడ్చల్ పట్టణంలో వాసవి మాత ఆలయం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మేడ్చల్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన వీరమల్లు శ్రావణ్ గుప్తా, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సఖిలం చంద్రమౌళి గుప్తా, మేడ్చల్ మండల యువజన అధ్యక్షుడిగా బొమ్మ వెంకట్ గుప్తా, మహిళ అధ్యక్షురాలిగా రాగం సంగీత గుప్తా లతో పాటు కార్యవర్గ సభ్యులతో చందా నాగభూషణం గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బెలిదే రమేశ్ గుప్త, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్ ఆర్య వైశ్య సంఘం మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చందా నాగ భూషణం గుప్తా, మేడ్చల్ ఆర్యవైశ్య సంఘం మండల,పట్టణ,యువజన, మహిళ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డి చొరవతో రూ.50లక్షలు మంజూరు

ఇటీవల మంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి.

- ఘటకేసర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు

ఘట్ కేసర్, మార్చి 25: అర్ధాంతరంగా పనులు నిలిచిపోయి పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులకు మాజీ మంత్రి మల్లారెడ్డి చొరవతో మంత్రి భట్టి విక్రమార్క రూ.50 లక్షలు మంజూరు చేయడం పట్ల ఘట్‌కేసర్ జేఏసీ, మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డిని కలిసి పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు సహకరించాలని వినతిపత్రం అందజేసి కోరారు. దీంతో స్పందించిన మల్లారెడ్డి ఇటీవల మంత్రి భట్టి విక్రమార్కను కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. స్పందించిన మంత్రి భట్టి విక్రమార్క రూ. 50 లక్షలు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిధుల మంజూరుతో ఘట్‌కేసర్ జేఏసీ చైర్మన్ మారం లక్ష్మారెడ్డి, సభ్యులు, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ గౌడ్, పలువురు కౌన్సిలర్లు మంత్రి భట్టి విక్రమార్క, మాజీ మంత్రి మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి చొరవతోనే బ్రిడ్జి నిర్మాణం 80 శాతం పూర్తయిందని తెలిపారు. తన సొంత నిధులను కూడా బ్రిడ్జి నిర్మాణానికి కేటాయించడం ఆయన గొప్పతనానికి నిదర్శనం అన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు సహకారం అందిస్తారని జేఏసీ, బీఆర్ఎస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం

మల్లయ్య (ఫైల్)

అభిలాష్ (ఫైల్)

మమత (ఫైల్)

వెంకటరావు (ఫైల్)

మల్కాజిగిరి, మార్చి 25: వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యమయ్యారు. మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై గణేశ్ బాబు కథనం ప్రకారం.. ఎన్టీనగర్‌లో నివసిస్తున్న మల్లయ్య (64) గత కొంత కాలంగా మానసిక వ్యాధికి చికిత్స పొందుతున్నాడు. 16న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాలేదు. ఇతని కోసం కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ దొరక లేదు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- **నేరేడ్‌మెట్:** నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫిల్‌గూడ పావని రెసిడెన్సీలో నివాసం ఉంటున్న కొత్తపేట అభిలాష్ (27) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనోపాధిపొందుతున్నాడు. గత కొన్ని రోజుల క్రితం ఉద్యోగం పోయింది. దాంతో అభిలాష్ మనస్తాపం చెంది ఈనెల 24న ఇంటినుంచి బయటికి వెళ్లాడు. అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.
- వినాయకనగర్ శ్రీకృపాఅపార్ట్‌మెంట్‌లో మమత (22) నివాసం ఉం టుంది. గత కొన్నిరోజుల నుంచి భర్తతో గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెంది తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. గతనెల 22న తల్లిదండ్రుల ఇంటినుంచి బయటికి వెళ్లింది. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. కుంటంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తామని తెలిపారు.
- జేజేనగర్‌లో నివాసం ఉంటున్నబి. వెంకటరావు (28) లేబర్‌గా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజుల నుంచి భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భర్త వెంకటరావు మనస్తాపం చెంది ఇంటినుంచి బయటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తామని చెప్పారు.

తైబజార్ వేలం రూ.31,06000

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 25: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం 2025-2026 సంవత్సరానికి నిర్వహించిన తైబజార్ వేలం రూ. 3106000లకు మంగళపురి కిరణ్ దక్కించుకున్నారని కమిషనర్ ఎ.నాగమణి తెలిపారు. మున్సిపాలిటీ నిర్ణయించిన కనీస ధర కంటే తక్కువ వచ్చినందున ఉన్నతాధికారులకు నివేదిక పంపి మళ్లీ వేలం పాటను నిర్వహిస్తామని వేలం తేదదీని త్వరలో ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బుడగ జంగాల శ్మశాన వాటిక అభివృద్ధి

ఉప్పల్, మార్చి 25: బుడగ జంగాల శ్మశాన వాటికను త్వరలో అభివృద్ధి చేస్తామని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుడగ జంగాల కాలనీ ప్రతినిధులు మంగళవారం కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. త్వరలోనే శ్మశాన వాటికకు నిధులు తీసుకొస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

భూమిని రీ సర్వే చేయాలి

కీసర, మార్చి 25: కీసరలోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద ఉన్న భూమిని మళ్లీ రీ సర్వే చేయాలని ఆలయ కమిటీ సభ్యులు సర్వే అధికారులను కోరారు. ఇటీవల బంగారు మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ తుడుం యాదగిరి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలతో పాటు పలువురు కమిటీ సభ్యులు సర్వేనంబర్ 223, 224లో ఉన్న గ్రామ కంఠం భూమిని బయటకు తీసి హద్దు ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, సర్వేయర్‌లకు వినతిపత్రాన్ని అందించారు. మంగళవారం మండల సర్వే అధికారులు సర్వే నిర్వహించారు. అధికారులు చేసిన సర్వే సరిగ్గా లేదంటూ మళ్లీ రీ సర్వే చేయాలని కమిటీ సభ్యులు సర్వే అధికారులను కోరారు.

'ప్రభుత్వ భూమిని కబ్జా చేయలేదు'

ఘట్‌కేసర్,మార్చి 25: ఘట్‌కేసర్ గట్టు మైసమ్మ ఆలయం సమీపంలో ప్రభుత్వ భూమిని నిషిజ యాజమాన్యం కబ్జా చేసినట్లు తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ యజమాని గంగాధర్ తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నిషిజ ఎస్టేట్ పేరుతో ఘట్‌కేసర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 543/3, 543/4, 543 /5, 543/6, 543/7, 543/8, 543/9 లోని 123 ఎకరాలలో వెంచర్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. హెచ్ఎండీఏ, రేరా అనుమతులతో పాటు మైనింగ్, బ్లాస్టింగ్ అనుమతులు సైతం కలిగి ఉన్నట్లు తెలిపారు. మా వెంచర్ పరిధిలో తూర్పున ఘట్‌కేసర్ గట్టు మైసమ్మ ఆలయం, పడమర దిక్కున 543/2 సర్వేనెంబర్‌లో ప్రభుత్వ భూమి 18 ఎకరాలు ఉందని గతంలో ప్రభుత్వ భూమికి నాటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సమక్షంలో హద్దులు ఏర్పాటు చేసి బోర్డులు నాటినట్లు చెప్పారు. ప్రభుత్వ భూమి చుట్టూ నిషిజ యాజమాన్యం ప్రహరీ నిర్మాణం చేసినట్లు తెలిపారు. ఘటకేసర్ గట్టు మైసమ్మ ఆలయానికి సంబంధించిన భూమి కానీ మరో వైపు ఉన్న ప్రభుత్వ భూమిని కానీ కబ్జా చేయలేదని, ఇటీవల కొంత మంది ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నట్లు చేసిన ఆరోపణలో వాస్తవం లేదన్నారు. మా పై అనవసరంగా తప్పుడు ఆరోపణలు చేసి మా సంస్థ పరువు, ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేదిలేదని, అలాంటి వారి పై న్యాయస్థానం ద్వారా పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

మేడ్చల్,మార్చి25: పోచారం పోలీస్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన బాలిక హత్య కేసులో నిందితున్ని పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. పోచారం ఇన్ఫోసెస్ క్యాంప్ కాలనీలో ఉంటున్న హప్సా హెంబ్రూమ్(35)అదే కాలనీలో ఉంటున్న రియా కుమారి (6)ను హత్య చేసిన సంఘటనలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వివర